సాక్షి
విశాఖపట్నం

శనివారం । 7 । డిసెంబర్ । 2024



ఆరు నెలల్లోనే గాడితప్పిన పాలన

ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం నడవడం లేదని, రాష్ట్రంలో నిత్యం ఎక్కడ చూసినా లైంగిక దాడులు,హత్యలు, భౌతిక దాడులు, దౌర్జన్యాలు.. ఇవే తప్ప మరొక్కటి లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు.

10లో

సాగరతీరం.. సునీత గానం



సాగరతీరం..చల్లని గాలులు....ఓ కోకిల స్వరం వీనుల విందు చేసింది. ప్రముఖ గాయని సునీత తన సుమధుర గాత్రంతో విశాఖవాసులను ఓలలాడించారు. సునీత లైవ్ కాన్సర్ట్ పేరుతో శుక్రవారం రాత్రి నిర్వహించిన సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. అందంగా లేనా... అసలేం బాలేనా అంటూ...గోదావరి సినిమాలోని పాటతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. చిన్ని చిన్ని ఆశ.. ముద్దుముద్దు ఆశ ఆమె ఆలపిస్తుండగా.. యువత గొంతు కలిపారు. నా చెలి రోజావే.. నాలో ఉన్నావే అంటూ యువతలో జోష్ నింపారు.సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్‌తో కలిసి సునీత పలు చిత్రాల్లోని పాటలు పాడి అలరించారు. – ఏయూ క్యాంపస్



పరుగో పరుగు

ఏపీఎస్ఆర్టీసీ, స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అఖిల భారత ప్రజా రవాణా సంస్థల అథ్లెటిక్స్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఈ పోటీలను ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావుతో కలిసి ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు.



10లో

ఎయిడెడ్..!



భీమునిపట్నంలోని సీబీఎం ఎయిడెడ్ స్కూల్

- టీచర్లు లేక సాగని చదువులు
- బడి మానేస్తున్న విద్యార్థులు
- అంతా యాజమాన్యాల ఇష్టారాజ్యం
- పోస్టుల భర్తీ పేరిట భారీగా వసూళ్లు
- జిల్లాలో 17 ఎయిడెడ్ స్కూళ్లలో 3,742 మంది విద్యార్థులు

విశాఖ విద్య: జిల్లాలో 17 ఎయిడెడ్ స్కూళ్లు నిర్వహిస్తుండగా వీటిలో 3,742 మంది చదువుకుంటున్నారు. వీరికి కూడా ప్రభుత్వం యూనిఫాం, పాఠ్యపుస్తకాలతో కూడిన స్టూడెంట్ కిట్‌ను అందిస్తోంది. మధ్యాహ్న భోజనం సమకూర్చుతోంది. మొత్తంగా 102 మంది ఉపాధ్యాయులు ప్రభుత్వ వేతనాలతోనే ఈ స్కూళ్లలో పనిచేస్తున్నారు. ఏడుగురు నాన్ టీచింగ్ సిబ్బందికి కూడా ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. కానీ వీరంతా కరస్పాండెంట్(ప్రైవేటు వ్యక్తులు) కనుసన్నల్లో పనిచేయాల్సిన పరిస్థితి. ప్రైవేటు యాజమాన్యాల ఇష్టారాజ్యంతో చదువులు సవ్యంగా సాగటం లేదనే విమర్శలు ఉన్నాయి.

విలీనానికి అవకాశం ఇచ్చినా..

ఎయిడెడ్ స్కూళ్లలో నెలకొన్న అధ్వాన పరిస్థితులను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటు యాజమాన్యాలకు, పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి మేలు చేసేలా విలీనానికి అవకాశం కల్పించింది. యాజమాన్యాల ఇష్టం మేరకు ఈ ప్రక్రియ చేపట్టింది. దీంతో జిల్లాలో పలు స్కూళ్లను ప్రభుత్వంలో విలీనం చేశారు. కానీ, కొన్ని చోట్ల విద్యార్థులు లేకున్నా, ఆస్తులు పోతాయనే భయంతో విలీనానికి ససేమిరా అన్నారు. ఇలాంటి స్కూళ్లలో కొన్ని చోట్ల క్రమేపీ అడ్మిషన్లు తగ్గిపోతున్నాయి. వీటి నిర్వహణపై ఆయా యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమనే విమర్శ ఉంది. కొన్ని యాజమాన్యాలు స్కూళ్ల నిర్వహణ పేరిట విద్యార్థుల నుంచి ఫీజులు సైతం భారీగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పోస్టుల భర్తీ పేరిట బేరసారాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేటు యాజమాన్యాలకు రెక్కలొచ్చాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేసుకునేందుకు త్వరలోనే అనుమతులు వచ్చేస్తాయని చెబుతూ, కొంతమంది ఎయిడెడ్ స్కూళ్ల యాజమాన్యాల వారు, వీటికి బేరాలు పెడుతున్నారనే ప్రచారం సాగుతోంది. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను ఆశిస్తున్న కొంతమంది ఇప్పటికే డబ్బులు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇలాంటి వాటికి ముందుగానే కట్టడి చేయకపోతే, యాజమాన్యాల చేతిలో నిరుద్యోగులు మోసపోయే ప్రమాదం ఉందని విద్యార్థి సంఘాల వారు అంటున్నారు.

సర్దుబాటుకు మోకాలడ్డు

కొన్ని స్కూళ్లలో విద్యార్థుల రేషియో కంటే ప్రభుత్వ వేతనాలతో పనిచేసే ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారు. డాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజం స్కూల్లో 137 మంది విద్యార్థులకు 10 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. యూపీఎస్ జీవీ నిలయంలో 56 మంది విద్యార్థులకు 8 మంది ఉపాధ్యాయులు, హిందుస్థాన్ షిప్‌యార్డు స్కూల్లో 53 మంది విద్యార్థులకు 10 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ నివేదికల ద్వారా తెలుస్తోంది. అయితే విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట ఉపాధ్యాయులు లేని పరిస్థితి. జెడ్పీ, మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు పని సర్దుబాటు జరిగినా, ఎయిడెడ్‌లో మాత్రం యాజమాన్యాలు న్యాయస్థానాలను ఆశ్రయించటంతో రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఫలితంగా నిరుపేద విద్యార్థులకు చదువులు అందని పరిస్థితులు నెలకొన్నాయి.

భలే భలే ఏరోనీరో

గాల్లో నీరు పుడుతుందే.. తాగితే మస్తుగుంటుందే



గాలిలో తేమ నుంచి నీటిని అందించే వాటర్ ప్యూరిఫయర్

Something Special

సాక్షి, విశాఖపట్నం :

ఏంటీ మిషన్. వాటర్ ప్యూరిఫయరా..?

యస్.. ఇది స్వచ్ఛమైన నీటిని అందించే మిషన్..

అరె.. దీనిలో నీరు నింపేందుకు పైప్ కనెక్ట్ చెయ్యలేదెందుకు.?

అవన్నీ మీకెందుకు..? మీకు కావాల్సింది నీరే కదా..

అవును తాగాలని ఉంది. కానీ...!!!!

నీ సందేహంతో పాటు.. దాహం కూడా తీరుతుందిలే. ఆ గ్లాస్ పట్టుకొని.. ట్యాప్ కింద పెట్టి చూడు..

అరే.. నీరు వస్తుంది.. ఇదెలా సాధ్యం..?

అదే మ్యాజిక్కు.. మాయా లేదు.. మంత్రం లేదు.. నీటిపైపూ లేదు.. శ్రమా లేదు.. నేను గానీ.. గ్లాస్ పట్టానంటే.. ఈ ప్యూరిఫయర్ నుంచి నీరు రావాల్సిందే...

బాబూ... ఆ ట్రిక్ ఏంటో చెప్పు..!!!

చెప్తా.. ఈ ప్యూరిఫయర్‌కు నీటి పైప్ అవసరం లేదు. కేవలం గాలిలో ఉన్న తేమను ఆక్సిజన్‌ని తీసుకొని.. నీటిగా మార్చేసుకుంటుంది. మనకు ఎంచక్కా అందించేస్తుంది.

అవునా.. నిజమా..!!

నిజం. ఇది కొత్త టెక్నాలజీ.. నీటి ఎద్దడి లేకుండా.. రాబోయే తరాలకు స్థిరమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యం అనే కాన్సెప్ట్‌తో అమెరికాలో స్థిరపడ్డ ఇండియన్ దుర్గాదాస్ ఆవిష్కరణ. ఈమె ఒకప్పటి భారత క్రికెట్ క్రీడాకారిణి కూడా. అమెరికా వెళ్లిపోయిన తర్వాత.. యూఎస్ మహిళా టీమ్‌కు కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు. ఆమె ఆలోచనల నుంచి పుట్టిందే ఏరోనీరో.

మరి.. గాల్లో ఎన్నో రకాల విష వాయువులు కూడా ఉంటాయి కదా.. మరి అందులోంచి తయారైన నీటిలో ఆ విషం ఉండదా.?



ప్యూరిఫయర్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు

అదేం ఉండదు. ఇందులో నాలుగు అంచెల వ్యవస్థ ఏర్పాటు చేయడంతో గాలిలోని తేమను పోర్టబుల్ డ్రింకింగ్ వాటర్‌గా మారుస్తుంది. తొలుత ఎయిర్ ప్యూరిఫికేషన్ జరుగుతుంది. దీని ద్వారా గాల్లో మలినాలు తొలగిపోతాయి. అక్కడి నుంచి కార్బన్ ప్యూరిఫికేషన్ ద్వారా అసహ్యకరమైన రుచి, వాసన, రంగు తొలగిపోతాయి. అప్పుడు నీటిగా మారుతుంది. ఆ నీటిని యూవీ ప్యూరిఫికేషన్ చేసి బ్యాక్టీరియాని నాశనం చేస్తాయి. అప్పుడు మినరల్స్ మిళితమవుతాయి. దీని ద్వారా పీహెచ్ లెవల్స్ 7 నుంచి 8.5 పీహెచ్‌గా ఉంటాయి. అంటే.. పూర్తి ఆల్కలిన్ వాటర్‌గా గాలిలో తేమ మారి.. స్వచ్ఛమైన నీటిని అందిస్తుంది.

భలేభలే.. మరి రోజుకు ఎన్ని లీటర్లు ఇస్తుందీ ఏరోనీరో..?

ఇందులో భిన్నమైన రకాలున్నాయంట. 10 నుంచి 25 లీటర్ల వరకూ ఇంట్లో వినియోగించే ప్యూరిఫయర్లున్నాయి. ఇప్పటి వరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాడుతున్నారు. ఈ ప్యూరిఫయర్ల అమ్మకాల లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ 1,71,50,920 లీటర్ల నీటిని తయారు చేశారంట. అంతేకాదు.. 6,86,03,680 లీటర్ల నీటిని ఆదా చేశారంట. సంస్థ వినూత్న ఆలోచన, నీటిని ఆదా చేస్తున్న విధానాన్ని మెచ్చి.. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు కూడా పొందారు.

అద్భుతం కదా.. మరి మీకెక్కడ తారసపడిందీ స్పెషల్ ప్యూరిఫయర్..?

ఓ.. అదా.. నగరంలో డీప్‌టెక్ కాంక్లేవ్ జరుగుతోంది కదా.. అక్కడ టెక్ ఎక్స్‌పోలో సంస్థ ప్రతినిధులు దీన్ని ప్రదర్శనకు ఉంచారు. చూస్తే.. అద్భుతమనిపించింది. మేం మాత్రమే తెలుసుకుంటే సరిపోదు కదా.. అందుకే.. 'సాక్షి' పాఠకులకీ అందిస్తున్నాం. ఇప్పుడు సరదాగా ఈ ప్యూరిఫయర్‌ను చూసి.. గాల్లో నీరు పుడుతుందే.. తాగితే మస్తుగుంటుందే.. అని పాడుకుందామా....!!

ముగిసిన డీప్ టెక్ సదస్సు

మహారాణిపేట: గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నేతృత్వంలో నిర్వహించిన నేషనల్ కాంక్లేవ్ ఆన్ డీప్ టెక్ ఇన్నోవేషన్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. నొవోటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు డి.బాల వీరాంజనేయ స్వామి,సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ఎంపి,ఎమ్మెల్యేలు,ఇరత ప్రజా ప్రతినిధులు,జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్,జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పర్యటన అనంతరం సాయంత్రం తిరిగి సీఎం విజయవాడ బయలు దేరారు. అధికారులు,మంత్రి బాల వీరాంజయనేయ స్వామి, సీపీ బాగ్చి, ఇతర అధికారులు సీఎంకు వీడ్కోలు పలికారు.

ప్రత్యామ్నాయం వైపు గిరిజనులను మళ్లించాలి

- ఏవోబీలో గంజాయి సాగును పూర్తిగా ధ్వంసం చేయాలి
- డీజీపీ ద్వారకా తిరుమలరావు



డీఐజీ, ఎస్పీలతో సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

సాక్షి, విశాఖపట్నం: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే గంజాయి వ్యాపారస్తులు గిరిజనులను మభ్యపెట్టి వారిని ఉచ్చులోకి లాగుతున్నారని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శుక్రవారం విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయాన్ని డీజీపీ సందర్శించారు. అనంతరం రేంజ్ పరిధిలో ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. గంజాయి పంట వలన జరిగే నష్టాలను వివరించి, వాణిజ్య పంటలు వేసుకునేలా గిరిజనులు అవగాహన కల్పించాలన్నారు. ఏపీని గంజాయి, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఏవోబీ ప్రాంతంలో గంజాయి సాగును పూర్తి స్థాయిలో ధ్వంసం చేయాలని ఆదేశించారు. రేంజ్ పరిధిలో ఉన్న జిల్లాల అధికారులు ఒడిశా పోలీసులతో సమన్వయం చేసుకొని, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను, డైనమిక్ చెక్‌పోస్టులను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పార్వతీపురం మన్యం ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో మురారికి బంగారు పతకం



సీతమ్మధార: తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూర్ పొల్లాచిలో 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ పోటీలలో విశాఖ యువకుడు బంగారు పతకం సాధించాడు. నగరంలోని 24వ వార్డు పాత రేసపువానిపాలెంకి చెందిన చందక వెంకట నాగ మురారి అండర్ 14 విభాగంలో బంగారు పతకం సాధించాడు. బంగారు పతకం సాధించిన మురారికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ పోటీలలో దేశంలోని 23 రాష్ట్రాలకు చెందిన 69 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సర్వం సిద్ధం



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం 'వేవ్స్–2024'కు సర్వం సిద్ధమైంది. శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సంవత్సరం నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్.ఎన్ సుబ్రహ్మణ్యన్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ ఎస్వీ ఆదినారాయణ రావు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు. రాష్ట్ర మానవ వనరులు, ఐటీ ఎలక్ట్రానిక్స్ ఆర్.టి.జి శాఖ మంత్రి నారా లోకేష్ , ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జి.ఎం. రావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

మధ్యాహ్నం 3గంటల నుంచి బీచ్ రోడ్ లోని కన్వెన్షన్ సెంటర్ వేదికగా కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 3.30 గంటల నుంచి 5.30గంల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, విభిన్న రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల అభిప్రాయాలు, పరిచయ కార్యక్రమాలు,ప్రసంగాలు జరుగుతాయి. కార్యక్రమం ఏర్పాట్లను ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణ రావు శుక్రవారం తన చాంబర్‌లో వివిధ విభాగాధిపతులతో సమీక్షించారు.

మొక్కుబడి సదస్సులు

- రెవెన్యూ సదస్సులకు కానరాని స్పందన
- తొలి రోజు జిల్లా వ్యాప్తంగా కేవలం 181 ఫిర్యాదుల స్వీకరణ
- 7 మండలాల్లో నిర్వహణ



మారికవలస రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో సంగీత్ మాథుర్

మహారాణిపేట: రెవెన్యూ సదస్సులు మొదటి రోజు మొక్కుబడిగా ప్రారంభమయ్యాయి. సదస్సుకు వచ్చి తమ సమస్యలు విన్నించుకోవాలని గురువారం ఇంటింటికి వెళ్లి కూటమి నేతలు ప్రజలను బతిమలాడారు. అయినప్పటికీ ప్రజలను నుంచి స్పందన లేకపోవడం గమనార్హం. జిల్లాలో 11 మండలాల్లో 156 గ్రామాలు, పట్టణాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు ఈ సదస్సులు జరగనున్నాయి. తొలి రోజు శుక్రవారం ప్రతి మండల పరిధిలో తహసీల్దార్ల ఆధ్వర్యంలో ఈ రెవెన్యూ సదస్సులు జరిగాయి. వాస్తవానికి 11 మండలాల్లో సదస్సులు జరగాల్సి ఉండగా.. తొలిరోజు ఆనందపురం, విశాఖ రూరల్, గాజువాక, భీమిలి, సీతమ్మధార, పద్మనాభం, మహారాణిపేట మొత్తంగా 7 మండలాల్లోనే సదస్సులు జరిగాయి. గోపాలపట్నం, ములగాడ, పెందుర్తి, పెదగంట్యాడ మండలాల్లో సదస్సులు జరగలేదు. ముఖ్యమంత్రి విశాఖ పర్యటన వల్ల ఈ నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించలేదు. ఈ మండలాల్లో ఆదివారం నుంచి సదస్సులు జరగనున్నాయి. తొలి రోజు 7 మండలాల్లో 181 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. ఇందులో అత్యధికంగా వ్యక్తిగత అంశాలపైనే కావడం విశేషం. అలాగే 22ఏలో తమ స్థలం ఉందని ఒకరు, వెబ్‌ల్యాండ్‌లో తప్పులు సరిదిద్దాలని 10 మంది, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి ఆరుగురు, మ్యుటేషన్‌పై 103 మంది వినతులు సమర్పించారు. ఇవన్నీ కూడా వారి వ్యక్తిగత సమస్యలు కారణంగానే ఫిర్యాదులు చేశారు. అదే విధంగా అత్యధికంగా పింఛన్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డులు వంటి వాటిపైనే ఫిర్యాదులు వచ్చాయి.

మండల వారీగా అందిన ఫిర్యాదులు

పద్మనాభం	80
మహారాణిపేట	20
విశాఖ రూరల్	30
ఆనందపురం	16
గాజువాక	13
సీతమ్మధార	13
భీమిలి	9

ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు

ఈ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను అధికారులు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచారు. వీటిని 45 రోజుల వ్యవధిలో పరిష్కరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే భూ వ్యవహారాలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి కొంత సమయం పట్టే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన వాటిని మాత్రం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సదస్సులకు రావాలని బతిమలాడుతూ..

ఈ సదస్సులు విజయవంతం చేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి కూటమి నేతలకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి వారితో ఫిర్యాదు చేయాలని జిల్లా ప్రజాప్రతినిధులు తమ అనుచరులకు బాధ్యతలు అప్పగించారు. వారు గురువారం ఉదయం నుంచి ఇంటింటికీ వెళ్లి సదస్సుకు రావాలని, ఫిర్యాదుల ఉంటే వినతిపత్రం ద్వారా అందజేయాలని బతిమలాడారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజలు ఈ సదస్సుకు హాజరుకాలేదు.

'ఆర్టీసీ' క్రీడా పోటీలు ప్రారంభం

- కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా ఆర్టీసీ ఉద్యోగుల అథ్లెటిక్ మీట్
- తొలిరోజు ఉత్సాహంగా పోటీలు


మార్చ్‌పాస్ట్‌లో తల్లితో పాల్గొన్న చిన్నారి


అలరించిన థింసా నృత్య ప్రదర్శన


నువ్వా.. నేనా..: మెన్ 800 మీటర్ల పోటీలో పరుగు పెడుతున్న అథ్లెట్లు

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎస్ఆర్టీసీ, స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అఖిల భారత ప్రజా రవాణా సంస్థల అథ్లెటిక్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఈ పోటీలను ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావుతో కలిసి ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. అనంతరం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ బ్యాండ్ కెప్టెన్ పాండురంగారావు సహకారంతో మార్చ్‌పాస్ట్ జరిగింది. ఔరంగబాద్, బెంగళూరు, ముంబయి, ఢిల్లీ, గుజరాత్, కల్యాణ కర్ణాటక, కె.ఎస్.ఆర్టీసీ, మహారాష్ట్ర, నార్త్‌వెస్ట్ కర్ణాటక, సేలం, తమిళనాడు, విల్లుపురం, కుంభకోణం, తెలంగాణ ఆర్టీసీ, ఉత్తరప్రదేశ్ ఆర్టీసీ, ఉత్తరాఖండ్ ఆర్టీసీలతో పాటు ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ అథ్లెట్లు మార్చ్‌పాస్ట్‌లో అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. ఆర్టీసీ చైర్మన్ క్రీడా జ్యోతిని వెలిగించి.. ఆటగాళ్లు వెంకటరావు, ఉమామహేశ్వర్, ధర్మరావు, చక్రధర్‌లకు అందించారు. ఏపీఆర్టీసీ జట్టు కెప్టెన్ శోభామంజరి పోటీల్లో పాల్గొంటున్న జట్ల కెప్టెన్లతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. జట్లు ఆటగాళ్లు డ్రిల్స్ ప్రదర్శించారు. తొలుత ముఖ్య అతిథి, ఆర్టీసీ చైర్మన్ వేదిక వద్దకు రావడం ఆలస్యం కావడంతో.. గిరిజన బృందంతో థింసా నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం మెన్ 800 మీటర్ల పరుగుతో పోటీలు ప్రారంభమయ్యాయి.

ఆర్టీసీ ఫాస్టెస్ట్ రన్నర్స్ కేశవ్, ప్రతీక్ష..

మెన్స్ 100 మీటర్ల పరుగులో ఎంఎస్ఆర్టీసీకి చెందిన కేశవ్ నాగబంగారు, వుమెన్స్‌లో ముంబయికి చెందిన ప్రతీక్షా సెల్లార్ మీట్ ఫాస్టెస్ట్ రన్నర్స్‌గా నిలిచారు. మెన్స్ విభాగంలో ఎంఎస్ఆర్టీసీకే చెందిన రాజేంద్ర ప్రధాన్ ద్వితీయ స్థానం, ఏపీఎస్ఆర్టీసీకి చెందిన రాంబాబు తృతీయ స్థానం దక్కించుకున్నారు. వుమెన్స్ విభాగంలో కర్ణాటక ఆర్టీసీకి చెందిన నాగరత్న ద్వితీయ స్థానంలో, ఏపీఎస్ఆర్టీసీకి చెందిన ఝాన్సీ తృతీయ స్థానంలో నిలిచారు. మెన్స్ 800 మీటర్ల పరుగులో ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీకి చెందిన చంద్రశేఖర్ విజేతగా నిలిచారు. అమిత్ సైనీ, హాలి రాజ్ తర్వాత స్థానాలను సాధించారు. షాట్‌పుట్ విభాగంలో మెన్స్‌లో ఎంఎస్ఆర్టీసీకి చెందిన ప్రవీణ్ విజేతగా నిలిచారు. శేఖర్, మంజిగౌడ వరసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వుమెన్స్‌లో కేఎస్ఆర్టీసీకి చెందిన మమత విజేతగా నిలవగా, సావిత్రి, సంక్రీమా తర్వాత స్థానాలు సాధించారు. వెయ్యి మీటర్ల (50+ వుమెన్) ఫాస్ట్‌వాక్‌లో ముంబయికి చెందిన కల్పన, కీర్తి, శాంతి మొదటి మూడు స్థానాలు సాధించారు.(-50 మెన్) విభాగంలో ఏపీఎస్ఆర్టీసీకి చెందిన హేమంత్‌కుమార్ విజేతగా నిలవగా, సత్పాల్, నారాయణ తర్వాత స్థానాలు సాధించారు. 100 మీటర్ల(-50 వుమెన్)లో ఏపీఎస్ఆర్టీసీకి చెందిన మంజుల విజేతగా నిలవగా, మౌషిని, లక్ష్మి తర్వాత స్థానాల్లో నిలిచారు.


పోటీలు ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు, డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఐఎస్‌జీ సభ్యుడిగా డాక్టర్ చలపతిరావు

సీతమ్మధార: ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ చలపతిరావు ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ(ఐఎస్‌జీ) గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ విధానంలో జరిగిన సొసైటీ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ఉన్న 4 వేల మంది గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌లు పాల్గొన్నారు. ఈ ఫలితాలను వారణాసిలో జరిగిన జాతీయ సదస్సులో శుక్రవారం ప్రకటించారు. విశాఖకు చెందిన డాక్టర్ చలపతి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం విశేషం. సదస్సులో భాగంగా ఆయనకు అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛాలు అందజేశారు. డాక్టర్ చలపతి 2025 నుంచి 2027 వరకు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. విభజన తర్వాత రాష్ట్రానికి చెందిన వైద్యుడు ఈ సొసైటీకి ఎన్నిక కావడం ఇదే తొలిసారి. ఆయన ఎన్నిక కావడంపై నగరానికి చెందిన వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.


డాక్టర్ చలపతిని అభినందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

దేశ వాణిజ్య ప్రగతిలో 'కెనరా' కీలకపాత్ర

అక్కిరెడ్డిపాలెం: దేశ వాణిజ్య ప్రగతిలో కెనరా బ్యాంకు పాత్ర కీలకమని ఆ బ్యాంకు ఏజీఎం(విజయవాడ) ఆనంద్ కుమార్ అన్నారు. ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో చట్టివానిపాలెం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమల క్లస్టర్ సమావేశం జరిగింది. దేశ వాణిజ్య ప్రగతిలో కెనరా బ్యాంకు పాత్ర, ఎంఎస్ఎంఈలకు అందజేస్తున్న రుణ సౌకర్యాలు వంటి అంశాలను బ్యాంక్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో భాగంగా అతిథులు బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ విశాఖ రీజనల్ హెడ్ మధుసూదన్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో ఏడీ ఐసీ జె.చంద్రమౌళి, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఐలా చైర్మన్ ఎస్.సత్యనారాయణ రెడ్డి, వై.సాంబశివరావు, వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, 100 మందికి పైగా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్యాంకు ఏజీఎం ఆనంద్‌కుమార్

రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం నడవట్లేదు

- లైంగికదాడులు, హత్యలు, భౌతిక దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయి
- ఆరు నెలల్లోనే పాలన గాడి తప్పింది
- అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం నడవడం లేదని, రాష్ట్రంలో నిత్యం ఎక్కడ చూసినా లైంగిక దాడులు,హత్యలు, దాడులు, దౌర్జన్యాలు.. ఇవే తప్ప మరొక్కటి లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం డాబాగార్డెన్స్ కూడలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, అన్నంరెడ్డి అదీప్ రాజ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పలువురు పార్టీ నాయకులతో కలిసి అమర్‌నాథ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కరని కొనియాడారు.

రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం ఉందా?

దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తుంటే.. మన రాష్ట్రంలో మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. రాజమండ్రిలో దళిత సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై నిర్దాక్షిణ్యంగా దాడికి పాల్పడ్డారని, మొత్తం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే పాలన గాడి తప్పిందని, క్రైం రేట్ బాగా పెరిగిపోయిందన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా నడవడం లేదన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఆక్షేపించారు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కూటమి ప్రభుత్వం అణగదొక్కాలని చూస్తోందని, అందుకనే వారిని అనేక ఇబ్బందులు పెడుతోందన్నారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందన్నారు. వారిని అణగదొక్కాలని ప్రయత్నిస్తే.. వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధం విభాగం అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయచంద్ర, పార్టీ ముఖ్య నాయకులు వుడా రవి, మొల్లి అప్పారావు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, పేడాడ రమణికుమారి, నడింపల్లి కృష్ణంరాజు, సతీష్‌వర్మ, కంట్రెడ్డి రామన్నపాత్రుడు, అల్లంపల్లి రాజాబాబు, సుజాత సత్యనారాయణ, దేవరకొండ మార్కండేయలు, వంకాయల మారుతీ ప్రసాద్, బోని బంగారు నాయుడు, తుల్లి చంద్రశేఖర్, కార్పొరేటర్లు బిపిన్‌కుమార్ జైన్, శశికళ, రెయ్యి వెంకటరమణ, చెన్నా జానకీరామ్, పార్టీ నాయకులు పల్లా దుర్గ, లింగం శ్రీను, అలపున కనకారెడ్డి, పీతల వాసు, బి.పద్మావతి, శంకవరం ప్రసాద్, అప్పన్న, సకలాబత్తుల ప్రసాదరావు, ఎండీ షరీఫ్, దశమంతుల చిన్ని, బుల్లెట్ రవి, డి వెంకట్రావు, పచ్చిరపల్లి రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో భవానీశంకర్, ఏవో ఈశ్వరరావు

మహారాణిపేట: కలెక్టరేట్‌లో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. డీఆర్వో భవానీశంకర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి ఈశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

అల్లిపురం: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అత్యంత ప్రామాణికంగా రాజ్యాంగం రచించారని, బలహీన వర్గాల వారికి తగిన హక్కులను పొందుపరిచారన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి వద్ద సీపీ శంఖబ్రత బాగ్చి పుష్పాంజలి

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

అల్లిపురం: రెగ్యులర్ పోలీస్ సిబ్బందితో సమానంగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. 62వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్మ్‌డ్ రిజర్వ్ బ్యారెక్స్, టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు పోలీస్ బందోబస్తులో హోంగార్డ్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. హోంగార్డులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేసి, సమస్యలు ఉంటే చికిత్స అందజేస్తామన్నారు. హోంగార్డుల వెయిటింగ్ హాల్ నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా హోంగార్డులకు వారి నివాసాలకు దగ్గరలో డ్యూటీలు వేసేలా, నైట్ డ్యూటీలు లేకుండా తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. హోంగార్డుల గ్రీవెన్స్ నిర్వహించి.. సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం మహిళా హోంగార్డులను సీపీ శంఖబ్రత బాగ్చి ఘనంగా సత్కరించారు.


మహిళా హోంగార్డును సత్కరిస్తున్న సీపీ బాగ్చి

నేడు మంత్రి లోకేష్ రాక

తాటిచెట్లపాలెం: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ శనివారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 2.50 గంటలకు విమానంలో విశాఖ చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా రామ్‌నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు వస్తారు. సాయంత్రం ఏయూలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

ఫార్మాసిటీలో మరో ప్రమాదం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో శుక్రవారం సాయంత్రం మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఫార్మాసిటిలో విజయశ్రీ ఆర్గానిక్స్ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో విష రసాయనాలు మీద పడడంతో ఇరువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. విజయశ్రీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ప్రొడక్షన్ బ్లాక్-1లో ఏఎస్ఎఫ్-డి రియాక్టర్ మ్యాన్‌హోల్ ఓపెన్ చేసినప్పుడు మంటలు ఎగసిపడ్డాయి. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న ఏఎస్ఆర్‌గా పనిచేస్తున్న రజ్జా, మరో ఉద్యోగి సీసీహెచ్ వెంకట సత్య సుబ్రహ్మణ్య స్వామి తీవ్రంగా గాయపడ్డారు. రజ్జాకు రెండు చేతులు కాలిపోగా స్వామి స్వల్పంగా గాయపడ్డాడని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. గాయపడిన వీరిని నగరంలోని ఇండస్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఘటన స్థలానికి వెళ్లి కారణాలు తెలుసుకున్నారు.

ఫార్మా పరిశ్రమ ఉద్యోగి దుర్మరణం


చైతన్య మృతదేహం

రాంబిల్లి: రాంబిల్లి మండలం ఎస్ఈజెడ్‌లోని ఎస్.వి. ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగి ఫిట్స్‌తో శుక్రవారం మృతి చెందినట్లు రాంబిల్లి సీఐ సిహెచ్.నరసింగరావు తెలిపారు. సీతమ్మధారకు చెందిన నడిమింటి కృష్ణచైతన్య (35) రాంబిల్లి సెజ్‌లోని ఎస్.వి.ఫార్మా పరిశ్రమలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. విధుల్లో ఉండగా గత నెల 28న కృష్ణచైతన్యకు ఫిట్స్ వచ్చి పడిపోగా కంపెనీ యాజమాన్యం కుటుంబ సభ్యుల సహకారంతో విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. కృష్ణచైతన్య తలకు గాయమవడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం 29న కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా అక్కడ 30న తలకు ఆపరేషన్ చేశారు. చికిత్స పొందుతూ కృష్ణచైతన్య ఈ నెల 5న మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కంపెనీ ఏజీఎం ఎం.శ్రీనివాసరావు 6న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి


మహారాణిపేట: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులతో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం పనిచేయాలన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం పాడుపడుతున్న నేపథ్యంలో.. వాటి అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం మాట్లాడుతూ 9 థీమ్‌ల అమలు కోసం అన్ని శాఖలకు లక్ష్యాలు నిర్దేశించినట్లు చెప్పారు. సీనియర్ ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దక్షిణ భారత చదరంగ పోటీలు ప్రారంభం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ వేదికగా అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల చందరంగ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భారతీయ విశ్వ విద్యాలయ సంఘం దక్షిణ మండల(సౌత్ జోన్) పరిధిలోని ఐదు రాష్ట్రాలకు చెందిన వర్సిటీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా.. గీతం ఇన్‌చార్జి వీసీ వై.గౌతమ్‌రావు, కార్యదర్శి భరద్వాజ్ ప్రారంభించి మాట్లాడారు. మహిళల మధ్య స్ఫూర్తిని, సమాన అవకాశాలను పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు వినతి

విశాఖ లీగల్: విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్టు హైకోర్టు బెంచ్ సాధన సమితి కన్వీనర్ ఐ.ఎం.అహ్మద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును శుక్రవారం సమితి కన్వీనర్, ఇతర న్యాయవాదులు కలిసి వినతిపత్రం సమర్పించారు.అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామికి కూడా వినతిపత్రం అందించారు. అనంతరం అహ్మద్ విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే హైకోర్టు బెంచ్ ఆవశ్యకతను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ముఖ్యమంత్రి స్పందించి విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం, మంత్రిని కలిసిన వారిలో న్యాయవాదులు జి.సుబ్బారావు, టి.బోసుబాబు, రాపేటి కిశోర్, పైలా శ్రీనివాసరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న హైకోర్టు సాధన సమితి కన్వీనర్ అహ్మద్

ఏయూ పురుషుల టీటీ జట్టు ఎంపిక

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం జరిగాయి. ఈ పోటీల్లో ఏయూతో పాటు అనుబంధ కళాశాలల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా ఈ ఎంపికలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10 నుంచి 14 వరకు విట్ యూనివర్సిటీ(వెల్లూరు) లో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ క్రీడాకారులను ఎంపిక చేశారు. టీమ్ కోచ్ రోహిత్, కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.


వర్సిటీ జట్టుతో స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య విజయ్ మోహన్

గంజాయి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ శుక్రవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.1,25,000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాదరావు తెలిపిన వివరాలివీ.. నిందితుడు బియ్యాని సత్తిబాబుది అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బెన్న ధూమ్వాలపట్నం. 2015 మార్చి 9వ తేదీ సాయంత్రం తన గ్రామంలోని పశువుల శాల దగ్గర 40 కిలోల గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ సమాచారం అందుకున్న రోలుగుంట పోలీసులు అతన్ని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

రేపు బీచ్‌రోడ్‌లో సబ్‌మెరైన్ డే

తాటిచెట్లపాలెం: 1967 డిసెంబర్ 8న మొదటి జలాంతర్గామి ఐఎన్ఎస్ కల్వరి భారత నౌకాదళంలో చేరింది. దీని గుర్తుగా ఇండియన్ నేవీ ఏటా డిసెంబర్ 8న సబ్‌మెరైన్ దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ మేరకు బీచ్‌రోడ్‌లోని కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం వద్ద ఆదివారం సాయంత్రం 5.15 గంటల నుంచి ఈఎన్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు భాషల పాటలకు మధురమైన సంగీతం జోడించి నేవీబ్యాండ్ అలరించనుంది. అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా బీచ్‌రోడ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తీరంలో డాల్ఫిన్ కళేబరం



కొమ్మాది: రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్ వెనుక గల బీచ్‌కు శుక్రవారం సాయంత్రం డాల్ఫిన్ కళేబరం కొట్టుకుని వచ్చింది. సముద్రంలో ప్రయాణించే బోట్లకు డాల్ఫిన్ ఢీకొట్టి.. మృతి చెంది ఉంటుందని మత్స్యకారులు తెలిపారు.